

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

# వీలునామా

చక్రపాణి ప్రాజ్ఞుడు. తెలివయినవాడు, మంచివాడు, ఇది లోకాభిప్రాయం. అంతేకాదు — ఐశ్వర్యవంతుడు. రెండు జూట్‌మిల్లులకి, ఒక కాటన్‌మిల్‌కి, మూడు షుగర్ ఫేక్టరీలకి, భారత దేశంలోని నాలుగు పెద్ద నగరాల్లో నాలుగు పెద్ద భవనాలకి అధిపతి. అనేక కంపెనీల్లో షేర్లు, డిబెంచర్లు వున్నాయి.

చక్రపాణికి ఈ లోకంలో తీరని కోరికలంటూ బహుశ వుండవేమోననుకుంటారు అతని కంపెనీల్లో పనిచేసే వుద్యోగులు. అందంగా వుండకపోయినా, చక్రపాణికి ఓ మంచి భార్య వుంది. చాలా భాగం ఆస్తి ఆవిడవల్లే కలిసివచ్చిందంటారు. అసలు చక్రపాణికి మొదట్లో ఏం లేకపోతే, మామగారి దూరపు బంధువుగాబట్టి చేరదీసి, కూతుర్నీ, ఆస్తినీ కట్టబెట్టాడు అంటారు కొందరు.

చక్రపాణి తన నలభై రెండో ఏడు దాటాక, సరిగ్గా నాలుగు నెలల ఆరు రోజుల తర్వాత ఓ రాత్రి తన ఆఫీస్ గదిలో ఆస్తి తాలూకు కాగితాలు చూస్తూ వాటిమధ్య కుప్పలా కూలాడు. డాక్టర్ షెవర్లెట్ కారులో వచ్చి, 'ఇక లేదు' అని స్థిర పరిచాడు.

ఆ తర్వాత మొదట ఆ ఇంటికి వచ్చింది లాయర్. చక్రపాణి భార్యకు ధైర్యం చెప్పి అన్ని ఏర్పాట్లు స్వయంగా చూడసాగాడు. మర్నాడు చక్రపాణి గౌరవార్థం ఆ నగరంలోని ఛేంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు సంతాపసూచకంగా మీటింగు ఏర్పాటు చేసారు.

నెల రోజుల తర్వాత చక్రపాణి లాయర్ — ఆయన ఆప్తమిత్రుడు — చక్రపాణి భార్యకి ఆయన వ్రాసిన విలునామా కాపీని పంపాడు. కొద్దిగా పనుండటంవల్ల ఢిల్లీ వెళ్తున్నాననీ, వచ్చాక కలుస్తాననీ మొహం చాటేసాడు.

చక్రపాణి భార్య విల్లు చదువుకుంది. చదువుతున్నకొద్దీ ఆవిడ ఆనందం ఎక్కువయింది.

"నా పేర వున్న రెండు జూట్‌మిల్స్ తాలూకు షేర్లు, ఒక కాటన్‌మిల్ తాలూకు షేర్లు, మూడు షుగర్ ఫేక్టరీల తాలూకు షేర్లు, బొంబే, ఢిల్లీ, మద్రాస్, కలకత్తాలలోని నా పేర వున్న గెస్ట్‌హౌస్‌లు నాలుగు, వివిధ కంపెనీలలోని షేర్లు, డిబెంచర్లు, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలోని యూనిట్స్, బేంక్ బేలన్సులు (వీటి వివరాలన్నీ విల్లులో యివ్వబడ్డాయి మొత్తాలతోసహా) అన్నీ నా భార్యకి చెందుతాయి.

కాని ఒక షరతుమీదే అవి నా భార్యకు చెందుతాయి. ఆ షరతేమిటంటే — నేను బ్రతికుండగా నాకు తీరని కోరిక ఒకటి మిగిలిపోయింది. అది యింట్లో, ముఖ్యంగా భోజనానంతరం, సిగార్స్ తాగాలన్న కోరిక. నా భార్యకి సిగార్ పొగ పడదు కాబట్టీ, బలవంతంగా నాచేత ఆ పని చేయకుండా మాన్పించింది మా పెళ్లయిన మొదటిరోజునుంచే! నా కోరికని ఆపుకోలేక టాయ్‌లెట్‌లోకి వెళ్లి రహస్యంగా తాగిన సందర్భాలున్నాయి. ఆ కారణంగా, ఈ విషయంలో నాకు నా భార్యంటే పరమ అసహ్యం వేస్తోంది. నాకు లభ్యమయ్యే ఒకానొక అమితానందాన్ని బలవంతంగా అణచివేసింది నా భార్య. నేను ఎన్నివిధాల బ్రతిమాలుకున్నా వినలేదు.

ఈ కారణంచేత, నా భార్య, రోజుకి పది సిగార్‌లు త్రాగే పక్షంలోనే నా ఆస్తికి ఆవిడపైని పేర్కొన్న విధంగా హక్కుదారు అవుతుంది. అలా త్రాగని పక్షంలో, నా ఆస్తిలోంచి ఆవిడకి ఒకే ఒక్క రూపాయ చెందుతుంది సంవత్సరానికి. మిగతాది నా పేర ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఆ ట్రస్ట్‌ద్వారా దేశంలోని సిగార్స్ త్రాగే ప్రతివాళ్లకి నా పేర వారానికి ఒక సిగార్ పెట్టె వుచితంగా పంచిపెట్టాలి. ఇది నా అంతిమ కోరిక."

## వల్లని వసంతం

— "సస్యశ్రీ"

వచ్చింది వసంతం అంటే నాకు
వల్లమాలిన వళ్లు మంట
అస్థిరమైన పక్షులమీద వస్తుంది;
అధరాలపై మధువును అద్దుకుని,
అన్నెంపున్నెం ఎరుగని పారిజాతాన్ని హత్తుకొని,
కవ్వించి కన్నెరికం చేస్తుంది.
తనువెల్లా తొలకరించిన అమరతరువు
పులకకో పువ్వెట్టెడు పూలు పూస్తుంది.

నిన్న రాత్రి పుట్టిన పూపాపలు
కన్ను నిండుగా తెరవకుండానే;
అదేమి వినోదమో మరి
అరుణోదయం కాకుండానే;
నేల రాలిన పారిజాతాలపై,
లీలగా అడుగులకు మడుగులొత్తుకుంటూ,
మరో మాలతి వద్దకో మాధవి వద్దకో చేరుతుంది
మట్టిపాలుచేసిన సుమనస్సుల మరచిపోయి!

వనమంతా తనదే అనుకునే వసంతానికి
మనసు ఏ ఒక్కరిమీదా మరు నిముసము నిలువదు
నిన్ను చూచి నోటితో నవ్వుతూనే
నొసటితో వెక్కిరిస్తుంది!
నిన్న కన్న కసరు మొగ్గలనుకూడా
కాలితో కెక్కిరిస్తుంది.
అందుకే ఆమని అంటే అది ఒక వింత రక్కసి!
అందుకే నాకు ఆ ఋతువంటే అంత అక్కసు!!